# తాగుబోతు

భీమన్న కల్లుపాక ఆవరణలోకి రవి సంకోచంతో అడుగుపెట్టాడు. అది మబ్బులు కమ్మిన రోజు. సూర్యుడు ఆకాశంలోకి అడుగు పెట్టినట్టుగా ఉంది. ఆ ఆవరణ చీకటితోను చీకటి లాంటి మత్తుతోను నిండి ఉంది. రవి తన తండ్రి నారాయణ కోసం ముఖాల మీద టార్చిలైటు వేసి చూస్తున్నాడు.

"ఇదిగో నారాయణ కొడకా!" అంటూ భీమన్న పిల్చాడు. అది విన్న రవి "చచ్చాన్రా! మధ్యలో వీడి ఉపన్యాసం ఓటి వినాలి" అనుకున్నాడు.

"మీ నాన్న పాకెనకాతల ఉచ్చోసుకోడానికి పోయి అక్కడే తొంగున్నాడు. నువ్వు రాకపోతే కాసేపటికి నేనే మోసుకొద్దును. వెళ్లి చూడు" అన్నాడు భీమన్న.

భీమన్న ఉంగరాలు తిరిగిన గుబురు జుట్టుతో, బాన పొట్టతో సినిమాల్లో చూపించే గూడెం పెద్దలా ఉంటాడు. అతనికి నారాయణ అంటే ప్రేముంది. తిట్టే చనువుంది. అతనికి తన తండ్రికి ఉన్న స్నేహానికి మూలం ఏమిటో రవికి తెలియదు. దాన్నికేవలం వ్యాపార సంబంధంగా ఊహించుకొంటాడు.

మీ అమ్మ ఉన్న రోజుల్లో మీ నాన్న ఇంతచేటు తాగేవాడు కాదంటాడు. మీ అమ్మే మీ నాన్నని కల్లు పాకకేసి తరిమిందంటాడు. మీ నాన్న కొలిమి దగ్గర్లో కల్లు పాక ఉండకపోతే ఖచ్చితంగా ఇంట్లోనే ఉంటాడు. పెళ్లాం పోయక మీ నాన్న మరో స్త్రీ కేసి కన్నెత్తి చూడలేదంటాడు. మీ నాన్న నెవత్తి పక్కలోకి రానీదంటాడు. రెండూ నిజమేనంటాడు. భీమన్నకి తన తండ్రి పట్ల విసుగు, జాలి తప్ప కోపం మాత్రం లేదని రవికి తెలుసు.

పాక వెనకాతలికి రవి వెళ్లి తండ్రిని చూసాడు. తండ్రి వేసుకున్న నల్ల పాంటు నల్లచొక్కా రేగడి మట్టిలో కలిసి మరింత నల్లనై చీకటిలో కలిసిపోయి ఉన్నాయి. ఉచ్చతో లాగు తడిసిపోయి ఉంది. కక్కుతో కల్లుతో తడిసి గడ్డం మీసం అక్కడక్కడ తెల్లగా ఉన్నాయి. తెల్ల వెంట్రుకలేవో, తెల్లగా కనిపిస్తున్న వెంట్రుకలేవో తెలియటం లేదు. రవికి తండ్రినాస్థితిలో చూస్తుంటే కడుపులో తిప్పింది. ఇటువంటి తండ్రికి తాను కొడుకుగా పుట్టడం తన కర్మ. తల్లి పోయాక తన కష్టాలెక్కువ అయ్యాయి. కనీసం ఇతగాడు ఛస్తే తనని ఏ పెద్దమ్మో జాలితో దగ్గరకు తీస్తుంది. కిందటేడు ఓసారి తన పెత్తల్లి తనని తీసుకువెళ్తానని ఓసారి తండ్రి నడిగి చూసింది.

"వాడు కూడా నా దగ్గర లేకపోతే నేనెవరి కోసం బతకాలి?" అంటూ తండ్రి పడనీయలేదు.

రవి బయటకు వచ్చి ఇల్లాంటి బేరాల కోసం, కాసుకొని కూర్చున్న ఓ రిక్షావాడిని పిలిచి, అతని సాయంతో తండ్రినింటికి చేర్చాడు. ఇటువంటి అవసరాలకి తండ్రి ఎప్పుడూ తన జేబులో ఓ అయిదు రూపాయలుంచుకొంటాడు. నారాయణ జేబులు వెతికి, రవి ఓ అయిదు రూపాయలనోటు తీసి రిక్షావాడికిచ్చాడు. తను ఒక్కడూ తండ్రి బట్టలు మార్చి వళ్లు తుడువ లేడు. తల్లి బతికున్న రోజుల్లో అయితే ఆమె తన సహాయంతో ఆ పని చేసేది. నారాయణని నేల మీద పరచిన చాప మీద పడుకోబెట్టేడు రిక్షావాడి సహాయంతో. కల్లు పాక రేగడి మట్టి కంటే చాప నయం అని నచ్చ చెప్పుకొన్నాడు.

రవి తండ్రి తాగుబోతుతనం గురించి తన దుస్థితి గురించి ఆలోచిస్తూ ఆలస్యంగా పడుక్కొన్నాడు.

రవి పొద్దున్న లేచేసరికి నారాయణ స్నానం చేసి వంట చేస్తున్నాడు. రవి పెరట్లోకి వెళ్ళాడు, తండ్రి రాత్రి పాడుచేసుకొన్న లాగు చొక్కా ఉతికి తాడుకు వేళ్లాడుతూ కనిపించాయి. ఈ బట్టల కంపు అంటుకోరాదన్నట్టు దూరంగా మరో తాడుకి రవి బట్టలు ఉతికి ఆరేసున్నాయి. నారాయణ కనీసం ఏ నాలుగున్నర అయిదుకో లేచుండాలి. చన్నీళ్లతో బట్టలుతికి చన్నీళ్ల స్నానం చేసి వంట మొదలుపెట్టి ఉండాలి. పీకల మొయ్య తాగిన వాళ్ళకి చలి తెలియదు కాబోలు అనుకొన్నాడు రవి.

రవి పళ్లు తోముకుని వచ్చేసరికి తండ్రి టీ గ్లాసు అందించాడు. టీ తాగేసరికి వేణ్ణీళ్ళు స్నానానికి తోడి ఉంచాడు. రవి స్నానం చేసి వచ్చేసరికి ఏడున్నరయింది. పళ్లెంలో టిఫిన్ పెట్టి ఇచ్చి రెండు కేరియర్లు సర్ది, తన కేరియర్ తీసుకొని నారాయణ బయల్దేర్తూ "వెళ్తున్నాను" అన్నాడు.

రవి రాత్రి జరిగిన దానికి తండ్రి పశ్చాత్తాపం వ్యక్తపరుస్తాడని అనుకొన్నాడు. నారాయణ రాత్రి ఏమీ జరగనట్టు దాని గురించి ఏమీ మాట్లాడలేదు. అసలు వాళ్లిద్దరి మధ్య మాటలు పొడిగా తయారై ఏడాది కావొస్తుంది.

"ఇవాళ స్కూలు ఫీజుకి చివరిరోజు" అన్నాడు రవి. అనడంలో అతని దుఃఖం తొంగి చూసింది. తండ్రి తన స్కూలు జీతం ప్రతిసారి గుర్తుచేస్తే గాని కట్టకపోడం రవిని బాధిస్తోంది. తల్లి పోయినప్పటి నుంచి ఇదే తంతు. ఆమె పోయి మూడేళ్లయింది. తల్లి బతికున్న రోజుల్లో తన చదువు గురించి ఎంతో శ్రద్ధ తీసుకొనేదన్న విషయం రవి మర్చిపోడు. దుఃఖం పొంగుకొస్తుంది రవికి.

"మధ్యాహ్నం వచ్చి కడ్తాలే" అన్నాడు నారాయణ.

తన స్కూలుకి తండ్రి రావటం రవికిష్టం ఉండదు. అతన్ని తన తండ్రిగా సహాధ్యాయులకి తెల్పాల్సిన పరిస్థితి అతనికి అవమానంగా ఉంటుంది. అందరి తండ్రుల్లాగా తన తండ్రి మంచి బట్టలు వేసుకోక పోయినా తనకి బాధలేదు. కాని ఆ మాసిన బట్టలు మాసిన గడ్డం దుబ్బు జుట్టూ క్రితంరోజు తాగిన కల్లు కంపుతో తన స్కూలుకి రావటం మాత్రం అతను సహించలేక పోతున్నాడు. రవికి ఆ స్కూల్లో "దట్ డ్రంకర్డ్స్ సన్" గా గుర్తింపు వచ్చింది. "పాపం ఆ పిల్లాడు కష్టపడి చదువుకొంటుంటే తండ్రి కనీసం సమయానికి జీతం కూడా కట్టడు. ఇర్రెస్పాన్సిబుల్ ఫెలో, గుడ్ ఫర్ నథింగ్ ఫెలో తాగుబోతు తనం వల్ల మంచి ఉద్యోగం పోగొట్టుకొన్నాడు. ఇప్పుడెవరూ అతనికి మంచి ఉద్యోగం ఇవ్వరు. పాసవడానికి మాత్రం మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లామా పాసయ్యాడు" అంటూ రవి హితులు రవి ముందరే సానుభూతి చూపిస్తూ ఉంటే రవి తన కష్టాలన్నింటికి తండ్రి తాగుబోతు తనమే కారణం అని నిర్ధారణకి వచ్చాడు. తాగుబోతు తండ్రితో అవసరమే కాని రవికి అతని పట్ల అనురాగం లేకుండా పోయింది.

"క్లాసుకువచ్చి రసీదివ్వక్కర్లేదు. ఇంటి దగ్గర తీసుకొంటాను. జీతం కట్టగానే మళ్లీ పన్లోకి వెళ్లిపో" అన్నాడు రవి.

"అల్లాగే" అన్నాడు నారాయణ.

ఒకసారి జీతం కట్టి ఆ రసీదు రవి మేష్టర్లకి చూపించాల్సిన అవసరం ఉంటుందేమోనని నారాయణ క్లాసుకు వెళ్లి రవి కోసం అడిగాడు. మేష్టరు నిర్లక్ష్యంగా "చూడు రవీ! నీ కోసం ఎవడో వచ్చాడు" అని రవితో అని, "ఏదైనా అర్జెంటు పనుంటే తప్ప క్లాసు డిస్టర్బు చెయ్యకూడదని తెలియదా?" అని నారాయణని విసుక్కున్నాడు.

నారాయణ తన క్లాసు విద్యార్థులలో ఎవరికైనా కావలసినవాడుగా, తండ్రిగా ఉండతగ్గవాడుగా ఆ మేష్టరికి అనిపించలేదు.

రవి రసీదు తీసుకుని లోపలికి వస్తుంటే మళ్లీ ఆ మేష్టరే అడిగాడు "వచ్చిందెవరు? ఎందుకు వచ్చాడు?" అని.

రవి చెప్పాడు.

నారాయణ, రవి తండ్రన్న మాట వినగానే క్లాసులో పిల్లలు తమాషాగా అనిపించి నవ్వారు. రవికి తల కొట్టేసినట్టయింది. అది గుర్తుకు వచ్చి నారాయణని తిన్నగా పన్లోకి వెళ్లిపొమ్మని రసీదు ఇంట్లో తీసుకొంటానని చెప్పాడు.

ఆ సంవత్సరం చివర పరీక్షలు వ్రాస్తున్నాడు రవి. అవి ఎస్.ఎస్.సి. పరీక్షలు పబ్లిక్ ఎగ్జామ్స్. అన్ని రోజులు నారాయణ బుద్ధిగా కల్లు పాకకేసి వెళ్లకుండా, వెళ్లినా వళ్లు వశంలో ఉంచుకొని ఇంటికి వచ్చి కొడుక్కి వంటచేసి పెట్టాడు. శుక్రవారంతో పరీక్షలు అయిపోయి ఉంటాయని అనుకొని శుక్రవారం రాత్రి బరువు దించుకొన్నట్టనిపించిన సంతోషంలో అంతవరకు బరువు మోసిన శ్రమతో తాగి యథా ప్రకారం స్పృహ తప్పాడు.

రవికి శనివారం చివరి పరీక్ష ఉంది. నారాయణ రవిని అడగలేదు. రవి చెప్పలేదు. ఇద్దరి మధ్య మాటలే చాలా రోజులుగా పెద్దగా లేవు. నారాయణని రవి విదిల్చి పారేస్తుండటంతో నారాయణ అవసరానికి మించి కొడుకుతో మాట్లాడటం మానేసాడు.

శుక్రవారం రాత్రి రవి తండ్రిని ఇంటికి మోసుకువచ్చాడు. శనివారం పరీక్ష ఉందని తెలియని నారాయణ ఆలస్యంగా లేచాడు.

"ఈ పూటకి బయట తిను" అంటూ నారాయణ పన్లోకి నడిచాడు.

రాత్రి తండ్రిని ఇంటికి మోసుకు రావటం, పొద్దున్నే టిఫిన్‌కి హోటల్‌కి వెళ్లాల్సి రావటంతో ఆ పరీక్షకి రవి చదవటం సరిగా కుదరలేదు. పరీక్ష వ్రాయగలిగినంత బాగా వ్రాయలేదు. రవికి తండ్రిపై విపరీతమైన కోపం వచ్చింది.

శనివారం రాత్రి ఇంటికి రాని తండ్రి గురించి పట్టించుకోలేదు. రాత్రి పది గంటలకి కొట్టుకట్టేసుకొని ఇంటికి పోతూ కల్లుపాక యజమాని భీమారావు, నారాయణని రిక్షాలో తీసుకువచ్చి ఇంట్లో దింపి వెళ్లాడు.

ఆదివారం పొద్దున్న రవి తండ్రిని నానా మాటలన్నాడు, తండ్రి "పరీక్షలెల్లా వ్రాసావు?" అని అడిగినప్పుడు.

"ఎల్లా వ్రాస్తాను? నా మొహంలా వ్రాసాను! తాగి కల్లు పాకలో తొంగునే వాళ్ల పిల్లలు పరీక్షలెల్లా వ్రాస్తారు? నేను బాగా వ్రాయాలన్న కోరికసలు నీకుంటే కదా! మా అమ్మ చచ్చి సుఖపడిపోయింది. బతికి నన్నాళ్లు రవి ఇంజనీరవాలనుకొంటూ ఊ హైరానా పడేది. నా చదువు కోసమే ఆఖరికి చచ్చిపోయింది. నీకటువంటి బాధ ఉంటే కదా!" అన్నాడు రవి. నారాయణ ఆ మాటలు తలవంచుకొని వింటూ నిలబడ్డాడు.

రవి తల్లి మూడేళ్ల క్రితం మోపెడ్ మీద వెళ్తూ చెట్టుకొమ్మ మీదపడి చచ్చిపోయింది. రవి తల్లి రవిని కాస్త ఖరీదైన స్కూల్లోనే చేర్చింది. ఆ సంవత్సరం మొదట్లో కట్టాల్సిన మొత్తం చేతిలో లేక స్కూలు కొలీగ్ దగ్గర అప్పు చెయ్యటానికి కొద్ది దూరంగా ఉన్న ఆ సహోద్యోగి ఇంటికి మోపెడ్ మీద బయల్దేరింది. ఆకాశం అంతా ఉరుముల్తో, మెరుపుల్తో కోలాహలంగా ఉంది. తండ్రి వెళ్తాననలేదు. తల్లే వెళ్లింది. ఆమె వెళ్తుంటే ఓ పిడుగు ఓ ఎండిపోయిన చెట్టు మీద పడి దాని పెద్దకొమ్మ ఒకటి విరిగి ఆమె మీద పడి ఆమె చనిపోయింది. రక్తం మడుగులో పడి ఉన్న తల్లి రవి లేత మనస్సు మీద బలమైన ముద్ర వేసింది. రవి తల్లికి బాగా చేరువ అవటం వల్ల ఆమె చావు అతన్ని బాగా కలిచి వేసింది. తనకి చదువు చెప్పించాల్సిన బాధ్యత తండ్రిది. డబ్బు చాలకపోతే అప్పు చెయ్యాల్సిన వాడు కూడా తండ్రే! కాని తన తండ్రి పనికిమాలిన వాడు. తన తండ్రి తాగుబోతు. అతను అడిగితే ఒక్క రూపాయి కూడా అప్పు పుట్టదు. "అతని చేతిలో డబ్బు పెడ్తే తాగి తగలేస్తాడు" అని ఎందరో అనటం రవి విన్నాడు. అందుకనే ఆ రోజు తల్లే బయల్దేర వలసివచ్చింది అప్పు కోసం.

తల్లి చావు గుర్తుకు రావటంతో రవి కోపంతో ఇంగితజ్ఞానం కూడా పోగొట్టుకున్నాడు.

"అమ్మ కాకుండా నువ్వు చచ్చిపోయుండాల్సింది. అమ్మా నేను హాయిగా బతికే వాళ్ళం" అని కూడా అన్నాడు ఆ దుఃఖంలో.

తల వంచుకొని రవి మాటలు వింటూ నిలబడ్డ నారాయణకి రవి అన్న ఆ చివరి మాటలు నిప్పురవ్వల్లా చెవులో పడ్డాయి. అతని కళ్ళు కాలిన ఇనుములా ఎఱ్ఱగా ఉన్నాయి. ఆ ఇనపముక్కని చల్లబరచడానికి నీటిలో ముంచి తీసినప్పుడు ఆవిరయ్యే ముందు మిగిలిపోయిన నీటిచుక్కల్లా అతని ఎఱ్ఱని కళ్లలో నీటి చుక్కలు నిలిచాయి. అతను నెమ్మదిగా తలెత్తి కొడుకును చూసాడు.

కొడుకు కళ్లల్లోది ద్వేషమా? అసహాయతా? అని అంచనా వేసుకొనేందుకు అన్నట్టు చూసాడు. కొడుకుపట్ల అతని ప్రేమ అతన్ని మాట్లాడనీయలేదు. మధ్యాహ్నం, రాత్రికి కూడా సరిపడేలా అన్నం వండాడు.

"పరీక్షలయ్యాయి కదా! మీ పెద్దమ్మ ఇంటికి వెళ్లు" అన్నాడు.

"నువ్వు నాకేం చెప్పనక్కర్లేదు" అన్నాడింకా మిగిలిన రోషంతో రవి.

కాస్సేపిటూ అటూ తచ్చాడి, "వెళ్తాను" అన్నాడు నారాయణ.

"కల్లు పాకకే కదా!" అన్నాడు రవి.

నారాయణ జవాబు చెప్పలేదు. కొడుకుకేసి ప్రేమగా చూసి బయటకి నడిచాడు. ఆ తాగుబోతు తండ్రి, ఆ పనికి మాలిన తండ్రి, కొడుకుమీద తన నీడ పడినా కూడా కొడుకుకి కష్టం కలుగుతోందన్న ఎరుకతో బయటికి నడిచాడు. భీమన్న అనబడే భీమారావుతో మాట్లాడాడు.

సాయంత్రం అయిదు గంటలవుతుండగా భీమారావు, "కొడుకా! ఇంట్లోనే ఉండావా?" అంటూ రవిని చూడటానికి వచ్చాడు.

"నేనింట్లోనే ఉన్నాను. నీ బేరం ఇంట్లోలేదు" అన్నాడు రవి.

"తెలిసే వచ్చాను. ఇవాళ నీతో చాలా మాట్లాడాలి. నీకు మా ఇల్లు చూపిస్తాను మా వీధి చూపిస్తాను మీ పిన్నమ్మను చూపిస్తాను పద" అన్నాడు భీమారావు.

రవి రానని చెప్దామనుకొన్నాడు. భీమారావులాంటి కల్లు పాక యజమానంటే తనకి అసహ్యం అని చెప్దామనుకొన్నాడు. కాని ధైర్యం చాలలేదు. తన తండ్రిని అప్పుడప్పుడు అతనే ఇంటికి జేరుస్తాడని, కనీసం ఆ కొద్ది సార్లయినా తనకి ఆ కల్లుపాక ఆవరణ చూడాల్సిన అవసరం తప్పుతోందని రవికి తెలుసు. ఆ నరకంలోకి ప్రవేశించాల్సిన అవసరం తప్పిస్తున్నందుకు కొద్దిగానైనా తను భీమారావుకి ఋణపడి ఉన్నాడన్న భావం రవికి ఉంది. అందుచేత పెంకి జవాబులు చెప్పక, చెప్పులు వేసుకొని బయటికి నడిచాడు.

రవి భుజం మీద చెయ్యివేసి భీమారావు నడుస్తుంటే ఎవరో అడిగారు, "ఏం భీమన్నా! నీ కొడుకా?" అని. "మన నారాయణ కొడుకు ఎ.స్సె.సీ. పరీక్షలు పూర్తి చేసాడు" అని జవాబు చెప్పాడు భీమారావు.

"ఇంకేం చేస్తావు?" అని రవిని ప్రశ్నించాడు.

"ఏం ఉంది. ఎక్కడో పన్లో జేరాలేమో! మా అమ్మ బతికుంటే ఇంటర్, ఎమ్‌సెట్, ఇంజనీరింగ్ అంటూ చెప్పేవాడినేమో! మా నాన్నకి స్కూలు జీతం కట్టడమే గగనమై పోయింది" – రవి గొంతుకలో తనకా అదృష్టం లేదన్న బాధ ధ్వనించింది. తండ్రి అసమర్థుడవటం మూలాన్నే తనకా అదృష్టం లేకపోవటం అన్న భావం కూడా ధ్వనించింది.

"మీ పెద్దమ్మ నిన్ను తీసుకువెళ్తానని కిందటేడు పెద్ద గొడవ చేసింది కదా! తీసుకువెళ్ళి చదువు చెప్పిస్తుందేమో అడిగిచూడు. ఆవిడ కుదర్దంటే ఇంటర్ వరకు నేను చెప్పిస్తాను. ఆ తరువాత ఏ స్కాలర్‌షిప్పో తెచ్చుకొని చదువుకొందుగాని"

ఆ స్కాలర్‌షిప్పులన్నీ మీ పిల్లలకి. మా కివ్వరు" అన్నాడు రవి.

రవి స్వభావం అర్థమౌతోంది భీమారావుకి. కాని శాంతంగా, "నిజమే! కాని నా కొడుకులకి నీలా చదువు మీద శ్రద్ధలేదు. వాళ్ళ సంగతి వదిలెయ్యి. నీ సంగతి చూసుకో"

అప్పటికి వాళ్ళిద్దరు రెండు కిలోమీటర్ల దూరం నడిచి ఓ వీధిలో ఉన్నారు.

"ఇదే మా వీధి" అన్నాడు భీమారావు.

కల్లుపాక యజమాని మధ్యతరగతి పేటలో ఉన్నాడా? అని రవి ఆశ్చర్యపోయాడు.

"ఇదే మా ఇల్లు" అంటూ చిన్న డాబా ఇల్లు చూపించాడు. లోపలికి తీసుకువెళ్ళి ఓ ముప్పై రెండేళ్ళ స్త్రీని చూపించి, "మీ పిన్నమ్మ" అన్నాడు. ఆవిడతో "నా స్నేహితుడు నారాయణ కొడుకు" అంటూ పరిచయం చేసాడు.

రవి 'స్నేహితుడ'న్న మాట విని ఆశ్చర్యపోయాడు. భీమారావు భాష కూడా ఇంతకు పూర్వంలా లేదు చదువుకొన్నవాడి భాషలాగా ఉంది.

"ఇవాళ రవి ఇక్కడే మనతో భోంచేస్తాడు" అని ఆవిడతో చెప్పి "పద బయటికి రా! నీకు మీ ఇల్లు చూపిస్తాను" అని రవిని పిలిచాడు.

"మా ఇల్లా!" అంటూ రవి ఆశ్చర్యంగా బయటకు నడిచాడు.

"అవును" అంటూ భీమారావు రవిని ఎదుర వరస ఇళ్లతో వీధి చివరన ఉన్న ఒక ఇంటి దగ్గరకు తీసుకువెళ్ళి–

"ఇదే మీ నాయనమ్మ, మీ నాన్న ఒకప్పుడున్న ఇల్లు. అప్పుడది మీ స్వంతిల్లు" అన్నాడు.

అదో పెంకుటిల్లు. పాడుబడినట్టుంది. ఒకప్పుడు బాగానే ఉండి ఉంటుందని పించింది. కొనుక్కున్న వాళ్లు శ్రద్ధ వహించినట్టులేదు.

"మీ అయ్య, అదేలే మీ నాన్న. కల్లు పాకలో కూర్చుని కూర్చుని అక్కడి మాటలే అప్రయత్నంగా నోట్లోంచి వస్తూ ఉంటాయి, మీ నాన్నతో కలసి చదువుకొన్న రోజుల్లో అచ్చు మీ నాన్నలా నే మాట్లాడేవాడిని, మీ నాన్న ఈ ఇంట్లో ఉన్నప్పుడు అచ్చు నీలా ఉండేవాడు".

తన తండ్రి తనలా ఉండేవాడా! అంటే తను తండ్రిలా ఉంటాడా! ఆ గడ్డం, ఆ మీసం ఆ దువ్వని జుట్టు, మురికి బట్టలు – ఛ అసహ్యంగా!

"మీ నాన్న ఇప్పుడైతే ఇలా ఉన్నాడు కాని ఆ రోజుల్లో ఏం చలాకీగా ఉండేవాడు. పాటలు చక్కగా పాడేవాడు. అందర్ని ఇమిటేట్ చేసి నవ్విస్తూ ఉండే వాడు. క్రికెట్ కూడా బాగా ఆడేవాడు. మీ నాన్నని చూస్తే మా అందరికి ఓ పెద్ద హీరోని చూసినట్టుండేది"

"ఇదంతా ఎప్పుడు?"

"పాతిక ముప్ఫై ఏళ్ల క్రితం. మీ నాన్న పాలిటెక్నిక్ చదువుకుపోయి మీ నాయనమ్మ ఇల్లమ్మేసి ఈ ఊళ్లో మరోచోటికి మారిపోయాక మా దార్లు వేరయ్యాయి. నేను ఎస్సెస్సీ పాసయ్యాక కల్లు వ్యాపారంలోకి దిగాను. లక్ష్మి పై చదువులకి పై ఊరుకి పోయి అక్కడ్నుంచి అమెరికా పోయింది. ఆ విధంగా మేం ముగ్గురం విడిపోయాం"

భీమారావుకి తనంటే ప్రేమెందుకో రవికి కొద్దిగా అర్థమైంది "లక్ష్మి ఎవరు?" అని అడిగాడు.

"మీ నాన్న గర్ల్ ఫ్రెండు. అదుగో మా వరసలో పెద్ద మేడ కనిపించటంలేదూ! ఆ ఇంటి వాళ్ల అమ్మాయి. సినిమాల్లో అయితే నేను 'అమ్మాయిగోరూ!' అని పిలివాల్సి వచ్చేదేమో! కాని నేను కాని నారాయణగాని ఆ పెద్దింటి పిల్లని ఎప్పుడూ లక్ష్మీ అనే పిలిచే వాళ్లం. లక్ష్మి మా క్లాసే. ఊళ్లో ఉన్నది ఒక్కటే బడి. అందుచేత ఆడపిల్లలు, మగ పిల్లలం కలసి చదువుకొనే వాళ్లం. లక్ష్మి చదువులో సరస్వతి. మా అందరికంటే తెలివైనది. మేం తెలియని పాఠాలు లక్ష్మి నడిగి నేర్చుకొనే వాళ్లం. ఆ సాన్నిహిత్యం వల్ల లక్ష్మికి మీ నాన్నకి ఒకరి పట్ల ఒకరికి ఆకర్షణ కలిగింది".

"మరి వాళ్లు పెళ్లి చేసుకోలేదేం?" రవి కుతూహలంగా అడిగాడు.

"సవాలక్ష కారణాలు. ఒక కులం కాదు. ఆ పిల్ల డబ్బున్నది. మీ నాన్న వాళ్లు కేవలం తినడానికి ఉన్న వాళ్లు. మాకు చిన్నప్పుడో పద్యం ఉండేదిలే! అన్నీ సమంగా ఏడిస్తేనే వాళ్ల మధ్య వివాహం. వివాదం కుదుర్తాయి అంటూ. స్నేహం ఉన్న రోజుల్లో ఇద్దరూ చిన్న వాళ్లు. పెళ్లి చేసుకొనే వయస్సు కాదు. చేసుకొంటామని చెప్పగలిగే వయస్సు కాదు. మీ నాన్నకి హైస్కూలు చదువు అవగానే పాలిటెక్నిక్‌లో డిప్లొమా చదవటానికి సీటు వచ్చింది. మీ నాన్న చదువులో నాలా అత్తెసరు మార్కుల వాడు కాకపోవడంతో, చదువు మధ్యలో డబ్బుకిబ్బంది పడ్డాడు. తల్లి ఉన్న పెంకుటిల్లు అయినకాడికి అమ్మినా,

మూడేళ్ల చదువు పూర్తవటానికి నాలుగేళ్లు పట్టింది. ఆ సమయానికి లక్ష్మి బియస్సి ఫస్టు క్లాసులో పాసైంది. ఆపైన మీ నాన్న కొన్నాళ్లు నిరుద్యోగం చేసాడులే! ఇక్కడే ఉద్యోగం చెయ్యాలని అతని ఆశ. చివరికి ఊళ్లో ఓ గుజరాతీ సేటు ఓ చిన్న కంపెనీ పెట్టి అందులో మీ నాన్నకుద్యోగం ఇచ్చాడు. నెలకి రెండు వేల రూపాయల జీతం మీద అప్పటికి లక్ష్మి ఎమ్మెస్సీలో గోల్డ్ మెడల్ సంపాదించింది.

మీ నాన్న లక్ష్మికి తన కోర్కె తెలియజేసాడు. లక్ష్మి మొదట్లో కొంత ఆశ్చర్యపోయినా, ఇబ్బంది పడినా నారాయణ కాకోర్కె కలగటం తప్పులేదని నారాయణ సరదా అయిన వాడని, తనకి ఈ ఊళ్లోనే కొత్తగా పెట్టిన కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం ఇస్తామన్నారు కనుక ఇద్దరి సంపాదనతో సంసారం సుఖంగా జరిగిపోతుందని అని ఒప్పుకొని ఇంట్లో చెప్పింది.

అదిగో అప్పుడు వాళ్లమ్మా వీళ్లమ్మా నెత్తీ నోరు కొట్టుకొన్నారు. వాళ్ల పెళ్లి జరిగితే ప్రపంచం ప్రళయం వచ్చి మునిగిపోతుందన్నారు. అది వచ్చేలోపల తాము విషంతిని ఛస్తామన్నారు. ఏదీ తేల్చుకోలేని లక్ష్మి అమెరికాలో చదువుకి స్కాలర్‌షిప్పు వస్తే వెళ్లిపోయింది.

"నేను నా పాక వైపు వెళ్లివస్తాను. మీ పిన్నమ్మ అన్నం పెడ్తుంది. మీ నాన్న ఇవాళ ఇంటికి వస్తాడనుకోను. అందుకని నువ్వు తిన్నాక ఇక్కడే పడుక్కో. రేపొద్దున్న మాట్లాడుకోవచ్చు" అని భీమారావు భీమన్నగా మారి కల్లు పాక వైపు నడిచాడు.

భీమారావు భార్య ఆపేక్షగా రవికి భోజనం పెట్టింది.

రవి, "మీకు మా అమ్మ తెల్సా? అని అడిగాడు. 'ఆంటీ' అనో 'పిన్నమ్మా' అనోపిలవడానికి అతనికి మనస్సు ఒప్పలేదు. అందుకే ఏ పిలుపు లేకుండా ప్రశ్నించాడు.

"తెలీకేం బాబూ! తెలుసు మీయమ్మ నా కంటే ఓ అయిదేళ్లు పెద్దదేమో! కాని నా పెళ్ళి మీ అమ్మ పెళ్లి కంటే రెండేళ్లు ముందైంది" అని మొదలు పెట్టి భీమారావు భార్య రవికి కొంత కథ చెప్పింది.

భీమారావుకి పెళ్లయినప్పుడు భీమారావు భార్య వయస్సు పదిహేను. వాళ్ల పెళ్లయిన రెండేళ్లకి నారాయణ పెళ్లయింది. అప్పుడు నారాయణ భార్య శ్రీదేవి వయస్సు ఇరవై ఒకటి. పెళ్లినాటికి శ్రీదేవి ఆ ఊరి స్కూల్లోనే చిన్న క్లాసులకి సైన్సు టీచరుగా పనిచేస్తూ ఉండేది. శ్రీదేవి తండ్రికి కొద్దిగా అయినా కట్నం ఇచ్చి పెళ్లిచేసే ఆసక్తీ, స్తోమతా, రెండూ లేక ఆమెకి పెళ్లి కావటం కష్టం అయింది. చూడ్డానికి అందంగానే ఉండేది. ఆ సమయంలో శ్రీదేవికి నారాయణతో పరిచయం అయింది. నారాయణ ఓ గుజరాతీ కంపెనీలో రెండువేల రూపాయల జీతం మీద సూపర్‌వైజర్‌గా చేరి కొద్ది నెలలయింది. అప్పుడు శ్రీదేవి జీతం కూడా అంతే! వాళ్ల కులాలు కూడా ఒకటే అని తెలిసాక భీమారావు

రంగంలోకి దిగి నారాయణని, నారాయణ తల్లిని, శ్రీదేవి తండ్రిని ఒప్పించి పెళ్లి జరిపించాడు.

నారాయణ చలాకీతనం, పాటలు పాడగలగటం చూసి శ్రీదేవే కాదు ఆమె అక్క కూడా ముచ్చటపడిపోయేది. "నీ అదృష్టం! నీకు ఇంజనీరు సంబంధం వచ్చింది. నాలాగా గుమస్తాని కట్టుకోవాల్సిన ఖర్మ నీకు పట్టనందుకు, నీమొగుడు ఎంతో సరదా అయిన వాడైనందుకు నాకు బాగా సంతోషంగా ఉంది" అనేది ఆమె అక్క మనస్ఫూర్తిగా.

నారాయణకి పెళ్లయిన మూడేళ్లకి రవి పుట్టాడు. రవి పుట్టిన రెండేళ్లకి అతని నాయనమ్మ పోయింది. నారాయణ తల్లిని శ్రీదేవి బాగానే చూసుకొనేది. రవిని నాయనమ్మ చూసుకొనేది. ఆవిడ పోయాక రవిని శ్రీదేవి కాస్త మంచి నర్సరీ స్కూల్లో జేర్పించింది. రవి కూడా నర్సరీ పద్యాలు అవీ చక్కగా నేర్చుకొని మంచి గొంతుతో పాడ్తూ ఉండేవాడు. అవి వింటూ శ్రీదేవి నారాయణలే కాక భీమారావు దంపతులు కూడా ఆనందిస్తూ ఉండేవారు.

"రవి అంతా వాళ్ల నాన్నగారి పోలికే! పాడ్తుంటే రాగం తప్పదు. స్కూల్లో మిస్సుల్ని ఇమిటేట్ చేయటం వీడికిప్పట్నుంచే అలవాటైంది" అని గర్వగా శ్రీదేవి చెప్తూ ఉండేది.

రవికి పదేళ్లు వచ్చేటప్పటికి నారాయణ జీతం మూడు వేల అయిదువందలు. శ్రీదేవి జీతం స్కేళ్లు అమలవటంతో అయిదువేలయింది. సరిగ్గా ఆ సమయంలో వాళ్ల జీవితం ఓ పెద్ద మలుపు తిరిగింది. నారాయణ వాళ్ల గుజరాతీ సేఠ్ నారాయణని గుజరాతులో తమ మెయిన్ కర్మాగారానికి ట్రాన్స్‌ఫర్ చేసాడు. దాంతో సమస్య మొదలైంది. అక్కడ శ్రీదేవి మళ్ళీ ఉద్యోగం చూసుకోవాలి! తెలుగు మీడియంలో సైన్సు చెప్పే ఆవిడకి గుజరాత్‌లో ఉద్యోగం ఎవరిస్తారు? ఏదో గుమస్తా ఉద్యోగం చెయ్యటానికి, శ్రీదేవి తప్పులతో తప్ప ఇంగ్లీషు వ్రాయలేదు, మాట్లాడలేదు. పిల్లలకి క్రెష్ లాంటిది పెట్టుకోడానికి గుజరాతీ రాదు.

శ్రీదేవికి మొండి ధైర్యం చాలానే ఉంది. "ఏదో ఒకటి చేస్తాను పోదాం పదండి" అంది.

నారాయణకి శ్రీదేవి పట్ల ప్రేమ ఉప్పొంగింది. తన ఉద్యోగం విషయం భీమారావుతో చర్చించాడు.

"శ్రీదేవి ఉద్యోగం పర్మనెంటు. నాది సేఠ్ ఆగ్రహానుగ్రహాలపై ఆధారపడే ఉద్యోగం. తన జీతం నాదాని కంటే ఎక్కువ. శ్రీదేవి గుజరాత్‌లో సంపాదించినా ఎంత సంపాదించగలదు? వెయ్యో, పదిహేను వందలో మా రెండు జీతాలు కలిపి ఈ ఊళ్లో తన జీతం అంత అవవు. పైగా మన భాష కాదు. మన రాష్ట్రం కాదు. నీలాంటి వాళ్ళ సహాయం ఉండదు"

"అంటే ఏం చేద్దామని నీ ఉద్దేశం నారాయణా?" అని భీమారావు అడిగాడు.

"నేను ఉద్యోగం మానేసి ఇక్కడే ఓ చిన్న ఉద్యోగం చూసుకొంటా" అన్నాడు నారాయణ. భీమారావు, అతని భార్య అతని నిర్ణయాన్ని సమర్ధించారు. కాని అదిలోకవిరుద్ధం అని హెచ్చరించారు.

"నేనే మొదటి వాడినౌతా! ఐ విల్ బి జస్ట్ ఎ హౌస్ హస్బెండ్ - ఏ ఉద్యోగం దొరకపోతే" అంటూ నారాయణ నవ్వేసాడు. భీమారావింట్లో హౌస్ హస్బెండ్ అనేమాట ఓ పెద్ద జోకైంది.

శ్రీదేవికి తన భర్త హిమాలయాలంత ఉన్నతుడులా అనిపించాడు.

"నారాయణ ఎమ్.సి.పి. కాదు మగవాళ్లందరు నారాయణలాగా ఆలోచించగలిగిననాడు స్త్రీల జీవితాలు నందన వనాలౌతాయి" అని పెళ్లి కాని స్త్రీవాదకన్యలు పొగిడారు.

"నాన్నా! ఉద్యోగం లేని మొగుడు పెళ్లానికి లోకువ అవుతాడురా!" అని చెప్పటానికి అతని తల్లి బతికి లేదు. ఇవన్నీ భీమారావు భార్య తన మాటల్లో చెప్పింది రవికి.

పరీక్షలకి రాత్రిళ్లు మేల్కొని చదివిన అలుపువల్ల రవి భీమారావు కల్లు పాక నుంచి వచ్చేలోపలే నిద్రపోయాడు. మర్నాడు కాఫీ తాగుతున్నప్పుడు భీమారావు రవికి పిన్నమ్మ చెప్పగా మిగిలిన కథ చెప్పసాగాడు.

మరో మంచి ఉద్యోగం కోసం వెతుక్కుంటుంటే ఓ యేడాది గడిచిపోయింది. రవి ఆలనా పాలనా, స్కూలుకి తీసుకువెళ్ళటం, తీసుకురావటం, అన్నం పెట్టటం నారాయణే చూసుకొన్నాడు ఆ యేడంతా. "హౌస్ హస్బెండ్ అంతే! మా ఆయనకి మరే ఉద్యోగం లేదు" అని ఆ రోజుల్లో శ్రీదేవి నవ్వుతూ చెప్తూ ఉండేది. అట్లా సంతోషంగానే తన కోసం ఉద్యోగం మానుకొన్న భర్తపై ఆరాధనతోనే శ్రీదేవి మొగుడి నిరుద్యోగపు మొదటి సంవత్సరం గడిపేసింది.

రెండో సంవత్సరం "ఏమిటీ మీ ఆయనకి ఉద్యోగం లేదా?" అని తన స్నేహితులంటూ ఉంటే శ్రీదేవి చిన్నబుచ్చుకోడం, "ఏదైనా ఉద్యోగం చెయ్యమని" సణగడం మొదలు పెట్టింది. రెండో ఏడాది నారాయణ ఏవో టెంపొరరీ ఉద్యోగాలు కొన్ని చేసాడు. ఉద్యోగానికి ఉద్యోగానికి మధ్య నిరుద్యోగంతో పాటు శ్రీదేవి మాటలు కూడా నారాయణని బాధించ సాగాయి. రాత్రిళ్లు నారాయణ కల్లు పాకలోని భీమారావుని ఓదార్పు కోసం ఆశ్రయించసాగాడు.

"అల్లాంటి ఓ రోజున మీ నాన్న దుఃఖం చూడలేక అతనిచేత కల్లు తాగించాను. మొదటిసారి ఎంతో బలవంతం చేస్తే తాగిన మీ నాన్న ఆ తరవాత పెద్దగా బలవంతం చేయకుండానే తాగడం, ఆ తరువాత అడిగి తాగడం మొదలు పెట్టాడు. ఆ విధంగా మీ నాన్న తాగుబోతుగా తయారవటానికి ఓ కారణం మీ అమ్మ అయితే మరో పెద్ద కారణం

నేను. మొదటి కారణం ట్రాన్స్‌ఫర్ చేసిన గుజరాతీ సేఠ్. చివరి. కారణం చుట్టుపట్ల అమ్మలక్కలు. కర్ణుడి చావుకి ఆరుగురు కారణం అయినట్టు నారాయణ తాగుబోతు అవటానికి నలుగురూ కారణం. మీ నాన్న క్లాసుమేటు ఫ్రెండు, కల్లు వ్యాపారం చేసేవాడు అయిన ఈ ఎదవఅసలు కారణం" అన్నాడు భీమారావు. భీమారావు స్నేహితుడిని తల్చుకొని బాధపడుతూ కాస్సే పాగాడు. అతని మాటల్లో 'అపరాధ భావం' ఉంది.

కొన్నాళ్లకి నారాయణ అలవాటుగా తాగటం మొదలు పెట్టాడు. అప్పుడు ఫ్రీగా తాగటానికిగాని, అప్పు పెట్టటానికి గాని, శ్రీదేవిని తన తాగుడికి డబ్బు అడగటానికిగాని, అతని మనసు ఒప్పలేదు. భీమారావు అప్పుడతనికి ఓ ఫౌండ్రీలో కొలిమి దగ్గర పార్ట్‌టైమ్ జాబు చూపించాడు. మూడో సంవత్సరం ఆ విధంగా నారాయణ కొద్దిగా సంపాదించుకొంటూ అందులో కొంత పెట్టి తాగుతూ మిగిలిన దాంతో రవికి పెన్సిళ్లు, రబ్బర్లు నోటు పుస్తకాలు కొంటూ గడిపాడు. అయితే అతనికి స్కూలు ఫీజులు కట్టడం, కొత్త బట్టలు కొనడం సాధ్యమయ్యేది కాదు. అతనికి తోటివారితో తాగుబోతుగా ముద్రపడిపోయింది. అతన్ని నమ్మి ఎవరూ డబ్బు అతని చేతిలో పెట్టేవారు కాదు, అతను తనది కానిడబ్బు తాగుడికి వినియోగించిన నిదర్శనాలు లేకపోయినా "తాగుబోతు పెళ్ళాం పుస్తెలమ్మైనా తాగుతాడు కాని మానలేడు" అన్నది జనానికి తాగుబోతుల మీదున్న అభిప్రాయం కదా!

"ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, రచయితలు, సినిమా యాక్టర్లూ అందరూ తాగుతారు వాళ్ల మీద కథలు రావు. లేబర్ క్లాసు మాత్రమే తాగి కుటుంబాల్ని కష్టపెడ్తారన్న తప్పుడభిప్రాయాన్ని ప్రచారం చేసే కథలు సినిమాలు, నాటకాలు బోలెడు. ఓసారి రిక్షావాళ్లు మాత్రమే తాగరని, పెళ్లాల్ని తన్నే రాజకీయ నాయకుల పేర్లు రేడియోలో ప్రసారం చేసేటట్టయితే తను సప్లై చేస్తాననీ వాళ్ళకి వ్రాసాడు మీ నాన్న అంత నిరుత్సాహ పరిస్థితుల్లో కూడా తన హాస్యధోరణి మానుకొనేవాడు కాదు" అని భీమారావు చెప్పాడు. రవి తనకి తెలియని ఒక కొత్త కోణంలో తండ్రి గురించి తెలుసుకోవటం ఆశ్చర్యంగా ఉంది.

మూడేళ్ల క్రితం ఏక్సిడెంట్‌లో శ్రీదేవి చనిపోయింది. అప్పటినుంచి కొలిమి దగ్గర ఆ వేడిలో రోజుకు ఎనిమిది గంటలు, కొన్ని రోజులు పది గంటలు కూడా పనిచేస్తూ రవిని నారాయణ చదివించసాగాడు. ఆ విధంగా రవి ఎనిమిది, తొమ్మిది, పదిచదివాడు. భీమారావు "అంత వేడిలో నీ చదువు కోసం అన్నేసి గంటలు పనిచేసిన మీ నాన్న దేవుడు కాదా? ఆ కష్టాన్ని, భార్యతో సహా అందరూ తనని చిన్నచూపు చూస్తుంటే కలిగే మనస్తాపాన్ని, మర్చిపోడానికి తాగే మీ నాన్న పనికిమాలిన వాడో కాడో నువ్వు తేల్చుకో!" అని నారాయణ కథ భీమారావు ముగించాడు.

"మా నాన్న ఏడి?" అని రవి కొంత పశ్చాత్తాపంతో, కొద్ది ఆత్రుతతో అడిగాడు. అతనికి తండ్రి పట్ల కొద్దిగా ప్రేమలాంటి భావం కలిగింది ఆ క్షణాన్న. కాని అప్పటికి కొద్ది గంటలు ఆలస్యం అయింది.

"మీ నాన్న మధ్యాహ్నం రైల్లో బొంబాయి వెళ్లాడు. అక్కడ మా మరో క్లాసుమేటు హుస్సేను ఉన్నాడు. అతను గల్ఫ్‌లో ఉద్యోగం చేసి వచ్చి లేబర్‌ని తురకదేశాల పంపించే ఏజెన్సీ పెట్టుకున్నాడు. మీ నాన్న అతనికి ఉత్తరం వ్రాస్తే బొంబాయి వస్తే సహాయం చేస్తానన్నాడుట. నిన్న ఆ విషయం నాతో చెప్పి రైలెక్కాడు. నీకు ఎవరూ చెప్పలేదేమో మీ నాన్నకి మంచి పనివాడుగా పేరుంది"

"మరి నా మాట?" రవి తన అనిశ్చితభవిష్యత్తుపై భయంతో అడిగాడు,

రవి వైపు భీమన్న అదోలా చూసాడు.

"మీ నాన్న చచ్చిపోయి ఉంటే బావుండునని మీ నాన్నతో నిన్న పొద్దున్న అన్నావుట కదా కొడకా! మనస్సు చాలా కష్టపెట్టుకున్నాడు. ఇన్నాళ్లూ తను లేకపోతే నువ్వు ఒంటరైపోతావేమోనని హుస్సేనుని సాయం కోరకుండా ఉండిపోయాడు. ఇప్పుడు నువ్వు పదో క్లాసు పాసయ్యావు. నీ పొట్ట నువ్వు పోషించుకోవడం కష్టం కాకపోవచ్చును అనుకొన్నాడు. కిందటేడు మీ పెద్దమ్మ నిన్ను తనకప్పచెప్పమని అడిగిందిట కదా! ఆవిడ చదువు చెప్పించేటట్టయితే ఆవిడ దగ్గరకి వెళ్లి ఉండమన్నాడు. ఆవిడ చెప్పించ లేకపోతే నిన్ను రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో పెట్టి చదువు చెప్పించమని నాకు చెప్పిపోయాడు. నా అప్పు మీ నాన్న తరువాత తీరుస్తానన్నాడు. మీకెవరికీ లేకపోయినా అతని నిజాయితీ మీద నాకు నమ్మకం చిన్నప్పుడే కాదు ఇప్పుడూ ఉంది అన్నాడు భీమన్న.

నిజానికి శ్రీదేవి ఏక్సిడెంట్‌లో పోయినప్పుడు ఇన్సూరెన్సు డబ్బు, ప్రావిడెంట్ డబ్బు నారాయణ చేతికి వచ్చాయి. అందులో అతను పైసా ఖర్చుపెట్టలేదు. ఆ డబ్బు రవికి పద్దెనిమిదేళ్లు వచ్చేసరికి మెచ్యూర్ అయి చేతికి వచ్చేలా ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేసాడు. ఆ విషయం స్నేహితుడు భీమన్నకి చెప్పాడు. ప్లస్ టూ (ఇంటర్ మీడియట్) చదువుకి అయ్యే ఖర్చు రవికి ఎడ్వాన్సు చెయ్యమని అతన్ని కోరి హామీ పొందాడు. పెద్దమ్మ ఒక పెద్దదిక్కుగా ఉండిసాయం చేసిందా మంచిదే! లేదా కుదరని అందరి పిల్లల్లాగానే హాస్టల్లో ఉండి చదువుకొంటాడు. తనవల్ల రవికి మనస్తాపమే కాని తనని అతను కొండంత అండగా అనుకోడు. ఇవన్నీ నారాయణ భీమన్నకి చెప్పాడు. కాని అతను రవికి చెప్పలేదు.

రవి పెద్దమ్మ ఇంటికి వెళ్లాడు. ఆమె అట్టహాసంగా ఆహ్వానించింది. నారాయణ కొడుకును విడిచిపెట్టి ఎటో వెళ్ళిపోయాడని, రవి ద్వారా విని,–

"ఆ తాగుబోతు వెధవ అంతపనీ చేస్తాడని ముందునుంచీ అనుమానమే నాకు. అందుకే కిందటేడు నిన్ను తీసుకుపోదాం అనుకొన్నాను. పరీక్షలెల్లా రాసావురా?" అని

అడిగింది పెద్దమ్మ. ఆమె తన చదువు గురించి పట్టించుకొన్నందుకు సంతోషిస్తూ-

"బాగా రాసాను. మంచి మార్కులు వస్తాయి. చివరి పరీక్ష అంత బాగా రాయలేదు. కాని ఓ అరవై అయిదో, డెబ్బయ్యో వస్తాయిలే!" అన్నాడు రవి.

"ఇంకేం చేస్తావు?"

" ఇంటర్ చదవాలనుంది పెద్దమ్మా"

"మరి డబ్బులు? మీ అమ్మ ఇనుష్యూరెన్సు తాలుకూ డబ్బు, ఉద్యోగం తాలూకూ డబ్బులు ఏమన్నా మీ నాన్న మిగిల్చాడా? అంతా తాగేసాడా?"

తెలీదు పెద్దమ్మా?!

"అనుమానం ఎందుకూ అంతా తాగేఉంటాడు! మరి చదువుకి డబ్బెల్లా?"

ఆ ప్రశ్నకి జవాబు ఏం చెప్పాలో రవికి తెలియలేదు. పెద్దమ్మ చెప్పించదా? చెప్పిస్తుందన్న తన ఆలోచన తప్పా? రవి మౌనంగా ఉండిపోయాడు. ఆ పెద్దమ్మే మళ్ళీ అంది.

"మీ నాన్నకో ఆడ స్నేహితురాలుండేదిలే లక్ష్మి అని మీ అమ్మను చేసుకోకముందు, ఆవిడని చేసుకుందామనుకున్నాడుట. ఈ గుదిబండని మీ అమ్మ తన మెడకు తగుల్చుకోవాల్సి ఉండగా ఆ పెళ్లెందుకు అవుతుందిలే!"

రవి లక్ష్మి గురించి ఆ క్రితం రోజువినే ఉన్నాడు. శ్రీదేవి కాకుండా తన తండ్రికి లక్ష్మితో పెళ్లయి ఉండి తను వాళ్లకు పుట్టిఉంటే తన జీవితం ఎల్లా ఉండునో అన్న ఆలోచన వచ్చి రవి ఆశ్చర్యపడ్డాడు. తను, తండ్రిపట్ల సానుభూతి ఏర్పరుచు కుంటున్నాడన్నమాట.!

"ఆవిడ కిందటేడు ఇండియా వచ్చి మీ నాన్నని చూడాలనుకుంది. ఆ కల్లు అంగడి భీమన్న ఉన్నాడుగా వాడితో వెళ్ళి మీ నాన్నను కలుసుకొందిట. ఆ కొలిమి దగ్గర పన్జేస్తున్న మీ నాన్నని చూసింది. సాయంత్రాలు కల్లు పాక మన్నులో పొర్లడం గురించి వింది. అప్పుడు నీ చదువు గురించిన విచారం ఆవిడకి కల్గి ఏం చెయ్యనని భీమన్న నడిగిందిట. వీలైతే డబ్బు సాయం చెయ్యమన్నాడుట అతను. లక్ష్మి తిరిగి వెళ్లిపోతూ తన తల్లికి కొంత డబ్బు ఇచ్చి నీ చదువుకి సాయం చెయ్యమందిట. లక్ష్మి తల్లి ఆ తాగుబోతు చేతికి తను డబ్బివ్వనని నేను నిన్ను దగ్గరకి తీస్తే నా చేతికిస్తానని చెప్పింది. అందుకని నేను కిందటేడు మీ నాన్నని నిన్ను నా దగ్గర పెరగనిమ్మని కోరాను. కుదరదు పొమ్మన్నాడు. ఇప్పుడు దైవికంగా నువ్వు నా దగ్గరకు వచ్చావు. సాయంత్రం వెళ్లి ఆ పెద్దావిడని కలుస్తాను" అంది పెద్దమ్మ.

రవికి మళ్లీ ఆశ చిగురించింది. హాస్టల్లో అనాధలాగా పడి ఉండి చదువుకోవాల్సిన అవసరం తనకి ఉండదనుకొన్నాడు.

ఉత్సాహంగా నవ్వుతూ వెళ్లిన పెద్దమ్మ ముఖం మాడ్చుకుని సాయంత్రం ఇంటికి వచ్చింది. "ఏం పెద్దమ్మా అల్లా ఉన్నావు! ఏమైంది" అని రవి ఆత్రుతతో అడిగాడు.

"ఏముంది నీ నెత్తిమీద శని దేవత నాట్యమాడుతోంది. ఆవిడ ఆ డబ్బు ఏదో గుడికిచ్చేసిందిట. నీ కివ్వాల్సిన అవసరం ఆవిడకి గాని, ఆవిడ కూతురికి గాని లేదుట" అని చెప్పింది పెద్దమ్మ రవితో.

"ఏవమ్మా! అతని బాధ్యత అతని తండ్రికి లేదు. తల్లి తరువాత తల్లంతటి దానివి పెద్దమ్మవి నువ్వు చదువు చెప్పించచ్చు కదా! కానీ నువ్వూ ఖర్చు పెట్టవు! నా కూతురి డబ్బు అడగటానికి ఏ మొహం పెట్టుకు వచ్చావు తల్లీ! సిగ్గులేకపోతే సరి! కందకు లేని దురద కత్తిపీట కెందుకు?" అని కూడా లక్ష్మి తల్లి అంది. పెద్దమ్మ ఆ మాటలు రవితో చెప్పలేదు.

ఎస్సెస్సీ పరీక్షా ఫలితాలు వచ్చేలోపల రవి వీధి కుళాయి నుంచి నీళ్లు తెచ్చేవాడిగా కూరల సంచీ మోసేవాడిగా పెద్దమ్మ ఇంట్లో మారాడు. పెద్దమ్మ డబ్బులిచ్చి కూరలు తెమ్మని నమ్మి ఎప్పుడూ డబ్బులివ్వలేదని కేవలం కూలీగా మాత్రమే వాడుకొంటోందని రవి పసి మనసుకి అర్థమయ్యేసరికి రిజల్సు వచ్చి రవి మంచి మార్కుల్తో పాసయ్యేడు. పెద్దమ్మ కాలేజీ సీటు మాట ఎత్తకపోడంతో భీమారావు దగ్గరకు వెళ్లి తన్ని హాస్టలున్న కాలేజీలో చేర్చమని బతిమాలుతూ అడిగాడు.

అతను, "అల్లాగే కొడకా!" అంటూ ఆ పని చేసాడు. హాస్టలుకు వెళ్లేరోజున పెద్దమ్మకి నమస్కరించి, ఆమె ఆశ్చర్యపోతుండగా సెలవు తీసుకొన్నాడు.

భీమారావు ద్వారా రవి చిరునామా తెలిసిన నారాయణ ఉత్తరం వ్రాసాడు రవికి కొంతకాలం తరువాత.

చిరంజీవి రవికీ,

ఇక్కడ నా ఉద్యోగం బావుంది. డబ్బు మిగుల్తోంది బాగా. కొద్ది రోజుల్లో నీకు కొద్ది పెద్దమొత్తమే పంపగలగుతాను. మీ అమ్మ చనిపోడం వల్ల నీ ఇంజనీరింగ్ చదువు ఆగదు! ఇక్కడ నా ఇల్లు సిమెంటు రేకిల్లు వర్కింగ్ డేస్ ఆఫీసులో చల్లగా గడిచి పోతాయి. ఎడారిలో రాత్రిళ్లు చల్లగా ఉంటాయని చిన్నప్పుడు చదువుకొన్నది ఇప్పుడు అనుభవంలోకి వస్తోంది. సెలవు రోజున అంటే శుక్రవారం నాడు కొంచెం ఎండ తట్టుకోవాలి. ఇనప కొలిమి దగ్గర పనిచేసిన వాడిని నాకీ వేడి ఓ లెక్కా! బాగా చదువుకో! మంచి ఉద్యోగం చెయ్యి! దాన్ని మాత్రం ఎప్పుడూ చెయ్యి జార్చుకోకు! తాగుబోతు కొడుకింకేమౌతాడని ఎప్పుడూ అనిపించుకోకు ఎవరిచేతా!

ఇట్లు, నీ తాగుబోతు తండ్రి

నారాయణ.